AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
14-10-2025 (Tuesday) MAIN EDITION

## ఎల్‌జీ బంపర్ లిస్టింగ్..




**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** ప్రైమరీ మార్కెట్‌లో ఈ వారంలో రెండు భారీ ఐపీవోలు లిస్టయ్యాయి. మెయిన్‌బోర్డ్ నుంచి వచ్చిన టాటా క్యాపిటల్ ఫ్లాట్‌గా లిస్టయి నిరాశ పరచగా.. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా మాత్రం భారీ లాభాలను అందించింది. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా రూ.11,607 కోట్లు సమీకరించేందుకు పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. మంగళవారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో లిస్టయ్యింది. ఒక్కో షేరు ధరను రూ. 1,140 గా నిర్ణయించగా.. 50 శాతం ప్రీమియంతో రూ. 1,710 వద్ద లిస్టయ్యింది. అంటే ఒక్కో షేరుపై రూ. 570 లాభం వచ్చింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సిట్ దర్యాప్తునకు సహకరించాలని ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావుకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు అడిగిన సమాచారం ఇవ్వాల్సిందేనిన తేల్చి చెప్పింది. క్లౌడ్, యాపిల్ క్లౌడ్‌కు సంబంధించిన పాస్‌వర్డులను సిట్‌కు ఇవ్వాలని తేల్చి చెప్పింది. అదే సమయంలో సిట్‌కు కూడా సుప్రీంకోర్టు కొన్ని షరతులు విధించింది. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో సమాచారాన్ని సేకరించాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది.

## ప్రధానికి గూగుల్ సీఈవో ఫోన్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ మంగళవారం ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. విశాఖపట్నంలో గూగుల్ రూ.88 వేల కోట్ల పెట్టుబడుల ప్రణాళికలను వివరించారు. ఇది దేశ అభివృద్ధిలో కీలక పరిణామంగా అభివర్ణించారు. విశాఖలో మొదటి గూగుల్ ఏఐ హబ్ కోసం కంపెనీ ప్రణాళికలను వివరించినట్లు పిచాయ్ 'ఎక్స్'లో ఓ పోస్టు చేశారు.

## దూసుకెళ్తున్న బంగారం ధరలు..



**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్ :** బంగారం ధరలు రోజుకు రోజుకు భారీగా పెరుగుతున్నాయి. నిత్యం రేట్లు పెరుగుతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,28,350గా ట్రేడ్ అయ్యింది. 22 క్యారెట్లకు రూ. 1,17,650 పలికింది. ఇక వెండి ధర కిలోకు రూ. 1,89,00గా నమోదైంది.

## పోలీస్ అధికారి సూసైడ్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** హర్యానాలో మరో పోలీస్ అధికారి సూసైడ్ చేసుకున్నాడు. ఇటీవల ఐపీఎస్ అధికారి పూరన్‌కుమార్ తుపాకీతో కాల్చుకొని చనిపోయాడు. తాజాగా ఏఎస్సై సందీప్ బలవన్మరణానికి పాల్పడ్డారు. కాగా.. ఐపీఎస్ పూరన్‌పై సందీప్ అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో ఆయన ఆత్మహత్యపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## గూగుల్ డేటా సెంటర్‌కు భారీ ప్రోత్సాహకాలు




**అక్షరటుడే, విశాఖ:** విశాఖపట్నంలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఏర్పాటు చేయబోతున్న డేటా సెంటర్ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలను ప్రకటించింది. మొత్తం రూ.22,002 కోట్ల విలువైన రాయితీలతో ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు లభించనున్నాయి. రూ.87,520 కోట్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో, వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించనున్న ఈ డేటా సెంటర్‌కు ప్రభుత్వం 480 ఎకరాలను కేటాయించింది. ప్రత్యేకంగా కేటాయించిన భూముల విలువలో 25 శాతం రాయితీ ఇవ్వనుంది. అదనంగా 15 ఎకరాలను ల్యాండింగ్ కేబుల్ స్టేషన్ కోసం కేటాయించడంతో పాటు వివిధ ఛార్జీలపై కూడా రాయితీ ఇచ్చింది.

## ఆర్జేడీ టికెట్ల పంపిణీపై గందరగోళం..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ ఎన్నికల వేళ రాష్ట్రీయ జనతాదళ్‌లో తీవ్ర గందరగోళం నెలకొంది. అభ్యర్థులకు పంపిణీ చేసిన టికెట్లను తిరిగి వెనక్కి ఇవ్వాలని కోరడంతో పార్టీలో కలకలం రేపింది. మహాఘట్ బంధన్ కూటమిలో సీట్ల పంపిణీ ఖరారు కాక ముందే ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ టికెట్లు పంపిణీ చేయడం కూటమిలో విభేదాలకు తావిచ్చింది. మిత్ర పార్టీల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పాటు కనీస సమాచారం ఇవ్వకుండా టికెట్లు కేటాయించడంపై తేజస్వి యాదవ్ కలత చెందారు. ఈ నేపథ్యంలో టికెట్లు పొందిన అభ్యర్థులు తిరిగి ఇచ్చేయాలని ఆయన కోరారు.



ఎర్రజెండా వెలిసిపోతోంది. ఒకనాడు సగర్వంగా ఎగిరిన ఎర్ర పతాక ఇవాళ పతనం దిశగా సాగుతోంది. దశాబ్దాల మావోయిస్టు ఉద్యమ ప్రస్థానం ఇక కాలగమనంలో కలిసిపోయే స్థాయికి దిగజారింది. ఒకనాడు సమాంతర పాలన కొనసాగించిన విప్లవ పార్టీ.. వరుస ఎదురుదెబ్బలు, పెరిగిన నిర్బంధాలతో మావోయిస్టు పార్టీ మనుగడకే ప్రశ్నార్థకంగా మారింది. కొత్త రిక్రూట్‌మెంట్లు లేకపోవడం.. వరుస ఎన్‌కౌంటర్లతో పాటు లొంగుబాట్లతో మావోయిస్టుల సంఖ్య పడిపోతోంది. రాష్ట్ర, కేంద్ర కమిటీ సభ్యులే కాదు, ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి సైతం ఎన్‌కౌంటర్ కావడం నక్సలైట్లను అంతర్మథనంలో పడేసింది. —అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# ఎర్రజెండాకు ఎదురుదెబ్బ

- విజయవంతమవుతున్న ఆపరేషన్ కగార్
- వరుసగా ఎన్‌కౌంటర్లు.. లొంగిపోతున్న నేతలు
- జనజీవనంలోకి అగ్రనేత మల్లోజుల
- 60 మందితో కలిసి లొంగుబాటు
- ప్రశ్నార్థకంగా మావోల మనుగడ

ఆపరేషన్ కగార్.. విప్లవ పార్టీ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసింది. కంచుకోటల్లోకి సైతం భద్రతా బలగాలు చొచ్చుకొస్తుండడం, అగ్ర నాయకత్వమే తుడిచి పెట్టుకు పోతుండడం పునరాలోచనలో పడేసింది. దీంతో మావోయిస్టులు ఆయుధాలు దించేందుకు సిద్ధమయ్యారు. విప్లవ పంథాను వీడి ప్రజా క్షేత్రంలోకి రావాలని యోచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మావోయిస్టు అగ్ర నేత, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియస్ సోనూ మంగళవారం జన జీవన స్రవంతిలో కలిశారు. 60 మంది అనుచరులతో ఆయన గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయారు.

### నక్సల్బరీ నుంచి మొదలు

తెలంగాణలో 1946లో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మావోయిస్టు పార్టీ సైద్ధాంతిక మూలాలకు పునాదిగా మారింది. పశ్చిమబెంగాల్‌లోని నక్సల్‌బరి గ్రామంలో 1967లో నక్సల్ ఉద్యమం పురుడు పోసుకుంది. ఆ తర్వాత దేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించింది. నక్సలైట్లుగా గుర్తింపు పొందిన మావోయిస్టులు తూర్పు, మధ్య భారత దేశంలో 'రెడ్ కారిడార్' ఏర్పాటు కోసం ఏకమయ్యారు. తూర్పున ఝార్ఖండ్ నుంచి పశ్చిమాన మహారాష్ట్ర వరకు దేశంలోని మూడొంతుల జిల్లాలకు విస్తరించారు. గ్రామీణ పేదలు, ఆదివాసుల హక్కుల కోసం పోరాటం పేరిట చాలా చోట్ల సమాంతర పాలనను నడిపించారు. ప్రజల నుంచి బలమైన మద్దతు లభించడం, సానుభూతిపరులు పెరగడంతో విప్లవ పార్టీ కొన్నేళ్ల పాటు ఒక వెలుగు వెలిగింది.

### ఎదురుదెబ్బలు..

అడవుల నుంచే పాలనను శాసిస్తున్న నక్సలైట్లపై మెల్లిమెల్లిగా నిర్బంధం పెరిగింది. విప్లవోద్యమాన్ని అంతమొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రణాళికలు రూపొందించాయి. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మావోయిస్టులపై మరింత నిర్బంధం పెరిగింది. కేంద్రం ప్రారంభించిన ఆపరేషన్ కగార్ విప్లవ పార్టీని తుడిచి పెట్టేస్తోంది. వందలాది మంది నక్సల్స్ ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు. అలాగే భారీగా పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. పట్టున్న ప్రాంతాల్లోకి బలగాలు చొచ్చుకుపోతున్నాయి. గతేడాది మొత్తం 357 మంది మావోయిస్టులు పోరాటంలో చనిపోయారు. ఈ సంవత్సరం ప్రథమార్థంలోనే అంతకు మించి నక్సల్స్ హతమయ్యారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజ్ కూడా ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. దీనికి తోడు ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లలో భారీగా కేడర్‌ను కోల్పోవడమే కాకుండా సెంట్రల్ కమిటీ సభ్యులు సైతం హతమయ్యారు. అధికారిక గణాంకాల ప్రకారం మావోయిస్టు ప్రభావిత జిల్లాలు 2014లో 76 ఉండగా.. 2024లో 42కి తగ్గాయి. అలాగే 2024లో 928 లొంగిపోగా.. 2025లో ఇప్పటికే దాదాపు 800 మంది లొంగిపోయారు.

### లొంగిపోయిన మల్లోజుల..

దేశాన్ని 2026 మార్చి నాటికి మావోయిస్టు రహితంగా మార్చుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆ దిశగా భద్రతా బలగాలు భారీ విజయాలు సాధిస్తున్నాయి. ఆపరేషన్ కగార్‌తో కేడర్ తగ్గిపోతుండడం, అడవులు చేజారిపోతుండడంతో మావోయిస్టులకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ తాజాగా గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయారు. 60 మంది అనుచరులతో కలిసి జన జీవన స్రవంతిలో కలిశారు. మల్లోజుల తలపై రూ.6 కోట్ల రివార్డు ఉంది. ఆయన లొంగుబాటును చత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ వర్మ ధ్రువీకరించారు. మిగిలిన నక్సలైట్లు కూడా లొంగిపోవాలని ఆయన సూచించారు. నక్సలిజం ఎన్నటికీ విజయం సాధించదని, మావోలు జన జీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు.

## 'బీఆర్ఎస్ పార్టీవి దొంగ ఏడుపులు'



**అక్షరటుడే, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలుపు కోసం బీఆర్ఎస్ పార్టీ సెంటిమెంట్ రాజకీయాలకు పాల్పడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అభ్యర్థి సునీత దొంగ ఏడుపులు ఏడుస్తున్నారన్నారు. ఆమెను ఏడవాలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రెచ్చగొడుతున్నారని వ్యాఖ్యానించారు. మంగళవారం జూబ్లీహిల్స్ పరిధిలోని వెంగళరావు నగర్ డివిజన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అనంతరం పొన్నం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ తీరుపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యే సునీత కంటతడి పెట్టారు. దీనిపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కేటీఆర్, హరీశ్‌రావులపై ధ్వజమెత్తారు. సునీతపై తమకు సానుభూతి ఉందని స్పష్టం చేశారు. కేటీఆర్, హరీష్ రావులు తమ రాజకీయాల కోసం సునీతను ఇబ్బంది పెడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. రాజకీయ వేదికలపై ఏడుపులు అనేవి మంచి పద్ధతి కాదని పొన్నం హితవు పలికారు.

## ఊరి బయటే వైన్స్‌లు : రాజగోపాల్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్** : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. తన నియోజకవర్గంలోని మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకునే వారికి నిబంధనలు విధించారు. మద్యం దుకాణాలను ఊరి బయటే ఏర్పాటు చేయాలని తేల్చి చెప్పారు. మునుగోడు నియోజకవర్గంలో వైన్ షాపులకు టెండర్లు వేసే వారు తప్పకుండా కొన్ని నిబంధనలు పాటించాల్సిందేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎవరినీ ఇబ్బంది పెట్టాలని కాదని, నియోజకవర్గ ప్రజలు, యువత ఆరోగ్యం కోసమే తమ తాపత్రాయమని చెప్పారు. మద్యం దుకాణాల నిర్వాహకులు సిట్టింగ్ రూంలు, పర్మిట్ రూంలు నడుపవద్దన్నారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేయకూడదని తేల్చి చెప్పారు. అలాగే, మద్యం దుకాణాల నిర్వాహకులు సిండికేట్ కావొద్దన్నారు. గతంలో నిర్వాహకులు సిండికేట్ అయి మద్యం ధరలు పెంచారని, ఇక నుంచి అలాంటి వాటికి అవకాశం ఇవ్వబోమని తేల్చి చెప్పారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకే మద్యాన్ని విక్రయించాలంటూ నిబంధనలు పెట్టడం చర్చనీయాంశమైంది.

## విండీస్‌పై భారత్ ఘన విజయం





**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** సొంత గడ్డపై జరుగుతున్న రెండో టెస్టులో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేయాలన్న ఆశతో బరిలోకి దిగిన టీమిండియా, చివరి రోజు ఆటకు ముందు విజయం కోసం కేవలం 58 పరుగుల దూరంలో ఉంది. అయితే ఐదో రోజు రాహుల్ (58 నాటౌట్) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఐదో రోజు ఆట మొదలైన కాసేపటికే సాయి సుదర్శన్ (39) చేజ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (13) మంచి టచ్‌లో కనిపించగా, భారీ షాట్‌కి ప్రయత్నించి ఔటయ్యాడు. ఐదో రోజు సుదర్శన్, గిల్ ఔటైన తర్వాత రాహుల్.. జురెల్‌తో కలిసి భారత్‌కి చిరస్మరణీయ విజయం అందించారు. కాగా.. టీమిండియా టెస్ట్ సిరీస్‌ను కైవసం చేసుకుంది.

## కిషన్‌రెడ్డిపై రాజాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు



**అక్షరటుడే, హైదరాబాద్:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మీరు ఎన్ని ఓట్ల తేడాతో ఓడిపోతారని కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఈ విషయం జూబ్లీహిల్స్ ప్రజలు అడుగుతున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ని గెలిపిస్తారా, కాంగ్రెస్‌ని గెలిపిస్తారా అని సామాజిక మాధ్యమాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వస్తుందన్నారు. కిషన్‌రెడ్డి గౌరవం ప్రమాదంలో ఉందని వ్యాఖ్యలు చేశారు. ఉప ఎన్నికల్లో భారీ ఓట్ల తేడాతో ఓడిపోతే కేంద్ర అధికారులకు ముఖం ఎలా చూపెడతారని కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. "నా జిల్లాను నాశనం చేసి నన్ను బయటికి పంపించారు మీరు కూడా ఏదో ఒక రోజు బయటకు వెళ్తారు" అని రాజాసింగ్ అన్నారు.

## ఐపీఎస్ అధికారి ఆత్మహత్యపై విచారణ జరపాలి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యపై తక్షణమే విచారణ జరపాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఛండీగఢ్‌లోని పూరన్ కుమార్ ఇంటికి మంగళవారం ఆయన వెళ్లారు. ఐపీఎస్ అధికారి కుటుంబాన్ని పరామర్శించారు. హర్యానా కేడర్‌కు చెందిన పూరన్‌కుమార్ ఈ నెల 7న ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆయన తుపాకీతో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఉన్నతాధికారుల వేధింపులే ఆత్మహత్యకు కారణమని సూసైడ్ లేఖ రాశారు. ఈ క్రమంలో మంగళవారం ఆయన కుటుంబాన్ని రాహుల్ గాంధీ పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పూరన్ ఆత్మహత్యపై తక్షణమే విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఇలియానా మూడో బిడ్డకు జన్మనివ్వబోతుందా..!



ఒకప్పుడు తెలుగు సినీ ఇండస్ట్రీని తన అందం, అద్భుతమైన నటనతో ఏలిన హీరోయిన్ ఇలియానా డి క్రూస్ ఇప్పుడు తన వ్యక్తిగత జీవితంతోనే వార్తల్లో నిలుస్తున్నారు. 2023లో ఆమె హాలీవుడ్ నిర్మాత మైఖేల్ డోలన్‌ను పెళ్లి చేసుకున్నారు. పెళ్లికి ముందే తమ తొలి బిడ్డ కోవా ఫీనిక్స్ డోలన్‌కు జన్మనిచ్చారు. ఇటీవల ఆమె రెండోసారి తల్లి అయ్యింది. కాగా.. ఆమె తాజాగా బేబి బంప్ వీడియో షేర్ చేయగా, ఇందులో ఊయల సర్దుతూ కనిపించింది. నా జీవితంలోకి కొత్త ప్రాణ స్నేహితుడు రాబోతున్నాడంటూ కామెంట్ చేసింది. దీంతో ఇల్లీ బేబి మరో బిడ్డకి జన్మనివ్వ బోతుందని భావించి అందరూ ఆమెకి కంగ్రాట్స్ చెబుతున్నారు.

– అక్షరటుడే, సినిమా డెస్క్